


అదితికి కమిషనర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం అశోక్ బంగ్లాలో ఆమెను మర్యాద పూర్వకంగా కలుసుకొని, పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు వివిధ విభాగాల అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అదితిని కలిసిన వారిలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ కె.శ్రీనివాసరావు, ఎసిపి అమ్మాజీరావు, మేనేజర్ ప్రసాదరావు, ఆడిట్ అధికారి లూథర్ పాల్, టిపిఆర్ఓ సింహాచలం, గణాంక అధికారి రోజా వెంకటలక్ష్మి, తదితరులు ఉన్నారు.

గెడ్డపోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాలు



అది నగర శివారు ప్రాంతం. అయితేనేం! అక్కడి గజం విలువ రూ.25 వేలు పైమాటే. అందుకే అక్కడి ప్రభుత్వ భూమిపై రాబందుల కన్ను పడింది. అంతే! మాజీ ఎమ్మెల్యే పేరుచెప్పి గెడ్డ పోరంబోకు భూమిని కబ్జా చేసి, ప్లాట్లుగా విభజించి, అమ్మేశారు. రూ.కోట్లలో సొమ్ములు కొల్లగొట్టేశారు. ఆ ప్రాంతంలో కొంతమంది ఆక్రమణదారులు పునాదులు కూడా నిర్మించేశారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. ఇదంతా జరుగుతున్నది నగర శివారున ఉన్న అయ్యప్పనగర్ కాలనీలోనే కావడం గమనార్హం.

అయ్యప్పనగర్ గెడ్డపై రాబందుల కన్ను

- గెడ్డపోరంబోకు భూమి ఆక్రమణ
- పట్టాలు లేకున్నా నిర్మాణాలు
- అక్రమంగా పునాదులు ఏర్పాటు
- చోద్యం చూస్తున్న యంత్రాంగం



అక్రమ కట్టడాలు తొలగించాలని కోరుతున్న అయ్యప్పనగర్ వాసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యప్పనగర కాలనీ పార్కును ఆనుకొని పెద్ద గెడ్డ ఉంది. రోజూ అదే గెడ్డ ప్రాంతంలో వందల సంఖ్యలో నగర వాసులు వాకింగ్, వ్యాయామాలు చేస్తుంటారు. అటువంటి ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నంలో కొందరు కబ్జాదారులు గెద్దల్లా కాచుకొని చూస్తున్నారు. గెడ్డను ఆనుకొని గత పాలకులు సుమారుగా 190 ఇళ్ల స్థలాలు ఆక్రమించి వారి అనుయాయులకు అప్పగించారు. గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో గత వైసిపి పాలన కాలంలో అయ్యప్ప నగర్ కాలనీ వాసులు, పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోరాడి, కలెక్టర్, తహశీల్దార్, మున్సిపల్ అధికారులకు వినతులు అందించారు. ఫలితంగా అక్రమ నిర్మాణాలను అధికారులు నిలిపివేశారు. ఎన్నికల సమయం దగ్గర పడటంతో నిర్మాణాలు జరగకుండా తాత్కాలికంగా అడ్డుకట్టవేశారు. ఎన్నికల పూర్తయ్యాయి.. ఇప్పుడు మళ్లీ నిర్మాణాలు ప్రారంభించేందుకు కొందరు ముందుకొచ్చారు. గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించుకోవడం నేరమని తెలిసినా గత పాలకులు, వారి అనుచరులు ఆక్రమించడమే కాకుండా, నిర్మాణాలు చేపడుతున్నారు. కొంతమంది గురువారం నిర్మాణాలు చేసేందుకు రావడంతో అయ్యప్పనగర్ వాసులు అడ్డుకొని ఆందోళన చేపట్టారు. ఇక్కడే అక్రమ కట్టడాలు చేపడితే ఊరుకునేది లేదని స్థానికులు స్పష్టంచేశారు.

మాజీ ఎమ్మెల్యే పేరుచెప్పి

ఇప్పటికే అయ్యప్ప నగర్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే పేరు చెప్పి అనేక ఆక్రమణలకు పాల్పడ్డారు. ఎటువంటి పట్టాలూ లేకుండా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేశారు. మధ్యతరగతి కుటుంబాలకు నివాసాలకు అనుకూలంగా ఉండటంతో ఒకరిద్దరు మాజీ ఎమ్మెల్యే అనుచరులు ఆక్రమణలకు పాల్పడటం, పట్టాలు చేయించి రూ.లక్షలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోతే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు పూర్తిగా కబ్జాకు గురికావడం ఖాయం.

ముంపు భయం

అయ్యప్పనగర్ కాలనీ పార్కును ఆనుకుని గెడ్డ ఉంది. ఆ గెడ్డపోరంబోకు భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే నీరు ప్రవహించే మార్గం మూసుకుపోతోంది. దీనివల్ల అయ్యప్పనగర్ కాలనీ ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకుంటే ప్రభుత్వ భూమిని కోల్పోయే ప్రమాదం ఉంది. వెంటనే ప్రభుత్వ భూమిని కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్తులపై దాడులు దారుణం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేయడం దారుణమని, ప్రజాస్వామ్యంలో విధ్వంసకర చర్యలు సరైనవి కావని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జెడ్‌పి చైర్మన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పరిసరాలలో గురువారం కూటమి నాయకులు విధ్వంసకర సంఘటనలకు పాల్పడటం చాలా బాధాకరమన్నారు. కొత్తవలస మండలం ఉత్తరాపల్లిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రంలో శిలాఫలకాలు ధ్వంసం చేసి ప్రభుత్వ ఆస్తికి నష్టం చేకూర్చడం ప్రజాస్వామ్యంలో హేయమైన చర్యని ఖండించారు. ప్రజాస్వామ్యంలో విధానపరమైన చర్యలే తప్ప, విధ్వంసకర చర్యలకు తావులేదని తెలిపారు. ఈ విధ్వంసకర ఘటనలను జిల్లా అధికారి యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా జరిగిన ఈ దాడులపై చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. జిల్లాలో అక్కడక్కడ వైసిపి కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసే వాతావరణం కలిగించినా.. సమన్వయంగా వ్యవహరించాలని తమ కార్యకర్తలకు సూచించామని చెప్పారు. నూతన ప్రభుత్వం ఏర్పడేటప్పుడు ఇటువంటి సంఘటనలు మామూలే కానీ, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని, కూటమి నాయకులు తమ కార్యకర్తలను అదుపు చేయాలని సూచించారు.

తాము అనేక సంవత్సరాలుగా రాజకీయాల్లో ప్రతిపక్షంలో కాని, అధికార పక్షంలో కాని ఎప్పుడూ ఇలాంటి సంఘటనలను చేయలేదని, ప్రోత్సహించలేదని గుర్తుచేశారు. మరీ ముఖ్యంగా శాంతియుతంగా ఉన్న ఉత్తరాంధ్ర లాంటి ప్రాంతంలో ఇలాంటి ఘటనలు బాధాకరమన్నారు. కూటమి నాయకులకు ప్రజలు ఇచ్చిన అధికారంతో బాధ్యతగా మెలగాలని, ప్రభుత్వ ఆస్తులపై ఇటువంటి దాడులతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయొద్దని హితవుపలికారు. సమావేశంలో కొప్పలవెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వైసిపి నాయకులు వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.

ఓటమిపై అధైర్యపడొద్దు

వైసిపి నాయకుల సమావేశంలో మజ్జి శ్రీనివాసరావు, కోలగట్ల



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరంటౌన్ : ఎన్నికల్లో ఓటమిపై వైసిపి శ్రేణులు అధైర్య పడొద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం నగరంలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఓటమి చెందినా కార్యకర్తలు అధైర్య పడవద్దని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. సామరస్యంగా ఉంటూ సంయమనం పాటించాల్సిన సంప్రదాయం అందరిపై ఉందన్నారు. మాజీ ఎమ్‌పి బెల్లాన మాట్లాడుతూ ఎన్నికల్లో సేవలందించిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. సమర్థవంతమైన నాయకత్వంతో ముందుకు సాగి మళ్లీ విజయం సాధిద్దామని పార్టీ శ్రేణులకు ధైర్యాన్నిచ్చారు. మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పును శిరసావహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ఫలితాలు తమకు నిరాశను కలిగించాయన్నారు. గెలుపోటములు సహజమేనన్న ధోరణితో ప్రజాతీర్పును హుందాగా స్వీకరిస్తున్నామని తెలిపారు. సమావేశంలో మేయరు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, మండల అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ మెట్టపై నుంచి జారిపడి

కార్మికుడు మృతి



పీకకు తాడు బిగిసుకొని మృతిచెందిన కార్మికుడు

ఇన్‌సెట్‌లో అప్పారావు (ఫైల్)

ప్రజాశక్తి-శృంగవరపుకోట

క్వారీ మెట్టపైనుంచి కార్మికుడు కాలుజారి పడటంతో పీకకు తాడు బిగుసుకొని మరణించాడు. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని ధర్మవరం సమీపంలోని క్వారీ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...

ధర్మవరం గ్రామానికి చెందిన లోతేటి అప్పారావు (45) గ్రామ సమీపంలోని దయ్యాలమెట్ట ను ఆనుకొని ఉన్న మల్లేశ్వర స్వామి క్వారీలో పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా శుక్రవారం ఉదయం ఐదు గంటలకు మెట్టపై చేతితో రాయిని కొట్టి అమ్ముకునేందుకు పైభాగానికి చేరుకున్నాడు. ఆరు గంటల సమయంలో నడుముకు తాడు కట్టుకొని పని చేసుకుంటున్నాడు. ఇదే సమయంలో అకస్మాత్తుగా కాలు జారింది. దీంతో క్వారీ పైభాగం నుంచి కిందకు జారిపోయాడు. ఆ సమయంలో చేతితో పట్టుకున్న తాడు మెడకు చుట్టుకోవడంతో వెంటనే బిగుసుకొని అక్కడికక్కడే చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు అక్కడకు చేరుకున్నారు. ఈ సంఘటనా స్థలానికి టిడిపి నాయకుడు లగుడు తిరుపతి, సర్పంచ్ సన్యాసయ్య, వైసిపి నాయకుడు అల్లు మహాలక్ష్మి నాయుడు తదితరులు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ పెద్దదిక్కు అప్పారావు మరణించడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. అప్పారావు కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు శస్త్రచికిత్స జరిగింది. ఆయన తల్లి హృద్రోగంతో బాధపడుతుంది. తన కష్టార్జితంతో వీరిని కంటికి రెప్పల కాపాడుకుంటూ, కుటుంబాన్ని పోషిస్తున్న అప్పారావు చనిపోవడంతో కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భీమసింగిని తెరిపిస్తారా..?

భీమసింగి సహకార చక్కెర కర్మాగారం ప్రభుత్వ విధానాల ఫలితంగా మూతపడింది. ప్రధానంగా వైసిపి ప్రభుత్వం ఫ్యాక్టరీని తెరిపించడం పట్ల చిత్తశుద్ధి చూపకపోగా, నెపాన్ని రైతులపైకి నెట్టింది. చెరకు సాగు సరిపడా లేకపోవడం వల్లే ఫ్యాక్టరీ నడవడం లేదని చెప్పుకొచ్చింది. మరోవైపు ఎర్ర జెండా ఆధ్వర్యంలో ఫ్యాక్టరీని తెరిపించాలని చేపట్టిన పోరాటంపైనా వైసిపి ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు రావడం, ఈ ప్రాంత రైతులు, కార్మికులు, ప్రజల నుంచి వైసిపి తీవ్ర అగ్రహాన్ని చవిచూసింది. తాజాగా జిల్లాలో ఏడుకు ఏడు స్థానాల్లో వైసిపిని ఓడించి, కూటమికి ప్రజలు పట్టం కట్టిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో ఇకనైనా భీమసింగికి మంచి రోజులు వస్తాయని రైతులు ఆకాంక్షిస్తున్నారు.



మూత పడిన భీమసింగి చక్కెర పరిశ్రమ

- గత ప్రభుత్వంలో చక్కెర పరిశ్రమ మూత
- తెరిపించాలని పోరాడిన రైతులపై ఉక్కుపాదం
- రైతు అగ్రహాన్ని చవిచూసిన వైసిపి
- ఫ్యాక్టరీ తెరిపించాలని ఆకాంక్ష

ప్రజాశక్తి - జామి

భీమసింగి చక్కెర ఫ్యాక్టరీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. రైతులు వాటా ధనాలతో నిర్మించుకున్న ఈ ఫ్యాక్టరీ మూసేయడం అంటే చరిత్రను చెరిపేయడమే. మరోవైపు ఏళ్లుగా ఫ్యాక్టరీని నమ్ముకుని ఉన్న కార్మికులు, ఉద్యోగులను రోడ్డు పడేయడమే. సహకార రంగాన్ని బలోపేతం చేస్తానని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసిన వైసిపి.. అధికారంలోకి వచ్చి రెండేళ్లపాటు కమిటీల పేరుతోనే కాలయాపన చేసి, చివరికి ఫ్యాక్టరీని మూసేసింది. దీనిపై చెరకు రైతులు, కార్మికులు, ప్రజలు ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. గతంలో చంద్రబాబు అభివృద్ధి చేస్తామని చెప్పి, నిపుణుల కమిటీని వేసి, చేతులు దులుపుకున్నారు. చివరికి ప్రభుత్వం ఆ కమిటీ నివేదిక మాత్రం బహిర్గతం కాలేదు. మరోసారి ప్రజల మద్దతుతో మళ్లీ అధికారంలోకి వచ్చారు. ఈసారైనా సహకార చక్కెర ఫ్యాక్టరీలపై టిడిపి సానుకూల రీతిలో తెరిపించే చర్యలు చేపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ఆ దిశగా దృష్టిసారిస్తే..

వాస్తవానికి సహకార ఫ్యాక్టరీలన్నీ 70 శాతం క్రషింగులు కుప్పకూలిపోయాయి. జిల్లాలో భీమసింగి సహకార ఫ్యాక్టరీ ఒకప్పుడు 1.60 లక్షల టన్నులు క్రషింగ్ చేయగా, ప్రస్తుతం 30 వేల టన్నులు కూడా లభ్యం కాదని అధికారులు సెలవిస్తున్నారు. ఆధునికీకరణ చేస్తామన్న పేరుతో క్రషింగ్‌ను ఆపేసిన వైసిపి ప్రభుత్వం పూర్తిగా ఫ్యాక్టరీని మూసేసింది. సహకార ఫ్యాక్టరీలను బాగు చేసేందుకు అనేక అవకాశాలున్నాయి. ప్రధానంగా సహకార ఫ్యాక్టరీలన్నీ పురాతనమైనవి కావడంతో ముందుగా యంత్రాలను ఆధునికీకరించాలి. తక్షణమే క్రషింగ్ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలి. తద్వారా బయో ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లు నెలకొల్పడం సాధ్యమవుతుంది. దీనికి సుమారుగా రూ.10 కోట్ల నుంచి 15 కోట్లు అవసరం ఉంటుందని గతంలో అంచనా. ఈ మూడింటిపై దృష్టి సారిస్తేనే మనుగడ సాధ్యం.

అప్పుడే రైతులకు మేలు

వ్యవసాయమే లాభసాటి కోల్పోతున్న నేపథ్యంలో ఏడాదికి గుత్తగా ఆదాయాన్ని సమకూర్చే చెరకు పంట బతకాలంటే, సహకార ఫ్యాక్టరీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో కొత్తగా కొలువు తీరబోయే మంత్రులతోపాటు ఏడుగురు ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీని నిలబెట్టేందుకు దృష్టిసారించాలి. అప్పుడే ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరుగుతుంది. ఆ దిశగా జిల్లాలోని ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న ఫోరం ప్రతినిధులు

కలెక్టర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను విజయవంతంగా పూర్తిచేసిన కలెక్టర్ నాగలక్ష్మిని ఫోరం ఫర్ బెటర్ విజయనగరం ప్రతినిధులు అభినందించారు. ఎన్నికల ప్రకటన వెలువడిన నాటి నుంచి ఫలితాలు వెలువడే వరకు ఎంతో బాధ్యతతో వ్యవహరించారని కొనియాడారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగడానికి సహకరించిన ప్రజలకు, ప్రజా నాయకులకు కలెక్టర్ నాగలక్ష్మి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్షులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ రవ్వా శ్రీనివాస్, రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, రోటరీ క్లబ్ జాయింట్ సెక్రటరీ రాజేంద్రకుమార్, లిఫ్టింగ్ హ్యాండ్స్ ప్రెసిడెంట్ శంకర్, రోటరియన్ హేమకుమార్ పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో ఎంతో మేలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో దోహదం చేస్తాయని డిపిఆర్‌ఒ రమేష్ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో 24 రోజుల పాటు విద్యార్థుల కోసం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడం, కంప్యూటర్‌పై ప్రాథమిక స్థాయి అవగాహన కల్పించడం, సంగీతం, చిత్రలేఖనం వంటి అంశాల్లో ఈ రంగాల్లోని నైపుణ్యమున్న వారితో ఉచిత శిక్షణ ఇచ్చారు. శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులు తాము శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్ర గ్రంథాలయంలో ప్రదర్శించారు. విద్యార్థిని షణ్ముఖప్రియ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన బాలలు పలు గీతాలను ఆలపించడంతోపాటు నృత్య ప్రదర్శనలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో డిపిఆర్‌ఒ రమేష్ మాట్లాడారు. విద్యాసంస్థల్లో పూర్తిగా పాఠ్యాంశాలు నేర్చుకోవడానికి మాత్రమే ప్రస్తుతం విద్యార్థులు పరిమితమవుతున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వేసవి సెలవులను తమకు ఆసక్తి గల అంశాల్లో నైపుణ్యాలను మెరుగు



విద్యార్థికి బహుమతి అందిస్తున్న డిపిఆర్‌ఒ రమేష్

పరుచుకొనేందుకు విద్యార్థులు వినియోగించడం మంచి పరిణామమని అన్నారు. ఈ శిబిరాన్ని నిర్వహించిన గ్రంథాలయ సంస్థను అభినందించారు. వయోజన విద్యాశాఖ డిడి సోమేష్ మాట్లాడుతూ జ్ఞాన సముపార్జనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అదే సమాజంలో వారికి గుర్తింపు ఇస్తుందని విద్యార్థులకు సూచించారు. టివి, మొబైల్ ఫోన్ వంటి వాటిపై తమ సమయాన్ని వృథా చేయకుండా విద్యపై అధికంగా దృష్టి పెడితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. స్వచ్ఛందంగా శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఉపాధ్యాయులు రాజశేఖర్, ఈశ్వర్, నృత్య సంగీత శిక్షణ ఇచ్చిన షణ్ముఖప్రియలకు డిపిఆర్‌ఒ డి.రమేష్, డిడి సోమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి జ్ఞాపికలు అందజేశారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన బాల బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : గ్రంథాలయాలు విద్యా భాండాగారాలని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు తెలిపారు. వేసవి శిక్షణ తరగతులు ముగ్గింపు కార్యక్రమాన్ని గాజులరేగ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు లైబ్రేరియన్ ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యాన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మొయిద నారాయణరావు

రీసుపేటలో కొట్లాట

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని తూడెం పంచాయతీ రీసుపేట గ్రామంలో టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య శుక్రవారం రాత్రి కొట్లాట జరిగింది. ఈ కొట్లాటలో రెండు పార్టీలకు చెందిన 10 మందికి గాయాలయ్యాయి. వీరిని సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం వైసిపి వార్డు సభ్యులు సమ్మంగి గంబీరమ్మ, ఆమె కుమారుడు నర్సింగరావు, టిడిపికి చెందిన రీసు శ్రీను, సింహాచలాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. సమ్మంగి నర్సింగరావు తలకు తీవ్ర గాయం కావడంతో కుట్లు పడ్డాయి. సిఐ రవికుమార్ ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేస్తామని ఆయన చెప్పారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు వి.వి.రాజేష్ తెలిపారు. శుక్రవారం డాబాలతోటలో సీతారామస్వామి కోవెల వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 రోజులుగా ప్రజలకు మజ్జిగ అందజేస్తున్నట్లు చెప్పారు. రోటరీ క్లబ్ ద్వారా పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, పాలిథిన్ వాడకం నిషేధంపై ప్రచారం, శుద్ధజల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో చేపట్టబోయే సేవా కార్యక్రమాల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అరుణ్ కుమార్ సుడాని, ప్రాజెక్టు చైర్మన్లు కొల్లా సాయిమనోజ్, కృష్ణగోపాల్ అగర్వాల్, బలభద్రుని అశోక్, మంచుకొండ అశోక్, పెంటపాటి కామరాజు, పి.ఎల్.ఎన్.మూర్తి, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యను బేబినాయనకు వివరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

జిఒ 117 రద్దుకు కృషి చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

117 జిఒ వల్ల పాఠశాల విద్యారంగానికి జరుగుతున్న నష్టాలను వివరించి రద్దు చేయించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె. విజయగౌరి ఎమ్మెల్యే బేబినానయను కోరారు. శుక్రవారం కోటలో యుటిఎఫ్ డివిజన్ నాయకత్వం ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇప్పటికే మ్యాపింగ్ చేసిన పాఠశాలలోను విలీనం కాకుండా ఆపాలని కోరారు. ఎమ్మెల్యే బేబినాయన స్పందిస్తూ పూర్తి వివరాలతో ఒక లెటర్ తనకు కావాలని అడిగారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

7,8,9 తరగతుల ప్రవేశాలకు దరఖాస్తులు

డెంకాడ: మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్లో 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ లోపల విద్యార్థులు దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ప్రస్తుతం చదువుతున్న తరగతి స్టడీ సర్టిఫికెట్ దరఖాస్తుతో పాటు ఇవ్వాలన్నారు. పరీక్షల నిర్వహించి మెరిట్ ప్రకారం ఎంపికలు ఉంటాయన్నారు. 7వ తరగతి స్టేట్ సిలబస్‌తో పాటు 8,9, తరగతులకు సెంట్రల్ సిలబస్ సిబిఎస్ఇ ఉంటాయన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష నిర్వహించే తేదీ త్వరలో తెలియజేస్తామని ప్రిన్సిపల్ తెలిపారు.

పదో తరగతి విద్యార్థికి అభినందన

నెల్లిమర్ల: పదోతరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినని శుక్రవారం గ్రామస్తులు అభినందించారు. శుక్రవారం జరజాపు పేట జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన మద్దిల లలిత పదోతరగతిలో 556మార్కులు సాధించినందుకు చిన మద్దిల కుటుంబ సభ్యులు ఆమెను అభినందించారు. లలితకు ముందు ప్రకటించిన పరీక్ష ఫలితాల్లో 548మార్కులు రాగా తిరిగి రీవేల్యూషన్ కోరగా 556 మార్కులు రావడంతో పాఠశాల ఉపాధ్యాయులు లలితను అభినందించి స్కూల్ ఫస్ట్ వచ్చినట్లు ప్రకటించారు. కాగా లలిత తండ్రి భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నేపథ్యంలో పదోతరగతిలో మార్కులు చూసి డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ యాజమాన్యం ఆర్థిక సహాయం అందించి విశాఖపట్నం విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ లో చదవడానికి ప్రోత్సహించారు.

డైరెక్టర్ పదవులకు పలువురి రాజీనామా

నెల్లిమర్ల: సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి పరాజయం కావడంతో పలువురు కార్పొరేషన్ డైరెక్టర్ పదవులకు రాజీనామా చేశారు. శుక్రవారం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి జనా ప్రసాద్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రేగాన శ్రీనివాసరావు, రహదార్లు భవనాల కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి నౌపాడ శ్రీనివాస రావు ఇంతక ముందు రాజీ నామాలు చేశారు.

నవధాన్యాలు కలపడంపై అవగాహన

తెర్లాం: మండలంలోని పూనువలస, పెదపాలవలస రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం నవధాన్యాల విత్తనాలు కలపడంపై వ్యవసాయాధికారి జి. సునీల్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలతో ఎంతో మేలు జరుగుతోందన్నారు. పంటకు ఎంటువంటి తెగుల్లా రాకుండా అధిక దిగుబడులకు నవధాన్యాలు ఉపయోగపడతాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో గల ప్రయోజనాలను, చిరుధాన్యాలు వాటి ఉపయోగాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎన్ కుమారమ్మ, గుల్లిపల్లి సరస్వతి, గుల్లిపల్లి పాపినాయుడు, గుల్లిపల్లి శ్రీరాములు, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం ఆదిలక్ష్మి, ఎపి ఎంఎస్ సిబ్బంది, యూనిట్ ఇంచార్జ్ వై తులసి, ఐసిఆర్‌పి బంగారం, భాగ్యం, టి. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు

శృంగవరపుకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు గల ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే జరుగుతుందని ఐ.ఇ.ఆర్.పిలు బి. లీలా కృష్ణ, ఆర్ శ్రీకన్యలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ మే ఒకటో తేదీన ప్రారంభమైన ఈ సర్వే ఈ నెల 9వ తేదీతో ముగుస్తుందన్నారు. ప్రత్యేక అవసరాల కోసం గుర్తించిన పిల్లలను స్థానిక భవితా కేంద్రంలో చేర్చాలని కోరామన్నారు.

సునీల గజపతికి అస్వస్థత

విజయనగరం కోట: కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు సతీమణి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీలా గజపతిరాజు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఆమెను విశాఖపట్నం ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించి తలలో రక్తం గడ్డ కట్టినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఘనంగా శ్రీవెంకటేశ్వరస్వామి వార్షికోత్సవం


లక్కవరపుకోట: మండలంలోని లచ్చంపేట గ్రామంలో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయానికి రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లలిత కుమారి దంపతులతో పాటు వేపాడ టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు అధికారుల అభినందనలు

బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును శుక్రవారం ఆయా నియోజకవర్గాల నాయకులు, అధికారులు పెద్ద ఎత్తున కలిసిన శుభాకాంక్షలు తెలిపారు.



బొబ్బిలి: బేబినాయనకు శుభాకాంక్షలు చెబుతున్న కమిషనర్ రామలక్ష్మి



భోగాపురం: ఎమ్మెల్యే మాధవికి శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు



విజయనగరం టౌన్: కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

నియంత పాలనకు ఓటుతో గుణపాఠం

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రంలో వైసిపి చేసిన నియంత పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. కోటలో కూటమి నాయకులతో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నియంత, అరాచక పాలన చేసిందన్నారు. నియంత పాలనపై ప్రజాగ్రహాన్ని ఎన్నికల్లో చూశామని చెప్పారు. ప్రజా వేదిక కూల్చిన రోజే వైసిపి పతనం ప్రారంభమైందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై లాబీయింగ్ చేయవద్దని నాయకులు, కార్యకర్తలను కోరారు. ప్రజలకు న్యాయం చేసే అధికారులను తెప్పిస్తామని చెప్పారు. పవన్ కళ్యాణ్ త్యాగం మరువలేనిదన్నారు. పట్టణ, గ్రామాల్లో అభినందన సభలు ఏర్పాటు చేయవద్దని కోరారు. బొబ్బిలి నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, అభివృద్ధికి పని చేస్తామన్నారు. తాగునీరు, రోడ్లు, కాలువలు, సాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామన్నారు. తన గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి పొత్తును అవహేళన చేసిన వైసిపికి కూటమిని గెలిపించి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. త్యాగానికి ప్రతిరూపం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లో జనసేన విజయం సాదించిందంటే పవన్ కళ్యాణ్‌పై ప్రజలకు అపార నమ్మకం ఉందన్నారు. బిజెపి కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు మాట్లాడుతూ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే బేబినాయనను కోరారు. జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి మాట్లాడుతూ కూటమిపై విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించారని, విశ్వాసాన్ని ఒమ్ము చేయకుండా పని చేయాలని ఎమ్మెల్యే బేబినాయనను కోరారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు పి.మనోజ్ కుమార్, జనసేన నాయకులు లంక రమేష్ పాల్గొన్నారు.

బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన



ఇండోర్ స్టేడియం పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు

బొబ్బిలి పట్టణంలోని ఐటిఐ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. బొబ్బిలి ప్రాంత క్రీడాకారులు కోసం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి టిడిపి హయాంలో తన సోదరుడు సుజయకృష్ణ రంగారావు మంత్రిగా చేసిన సమయంలో నిధులు మంజూరు చేస్తే వైసిపి ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. టిడిపి హయాంలో నిధులు మంజూరై పనులు పూర్తి చేయని పనులపై సెల్ఫీ ఛాలెంజ్‌కు టిడిపి పిలుపునివ్వడంతో ఇండోర్ స్టేడియంపై మొదట సెల్ఫీ ఛాలెంజ్ చేశామన్నారు. సెల్ఫీ ఛాలెంజ్ తర్వాత బుడా నిధులు కొంత కలిసి పనులు ప్రారంభించారని, ఆయా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనులపై పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణామూర్తి, మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిను అడిగి తెలుసుకున్నారు. ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేసి క్రీడాకారులు కలను సాకారం చేయాలని క్రీడాకారులు అపర్ణబాబా, సుంకరి సాయిరమేష్, బేబినాయనను కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో మౌలిక సౌకర్యాలు కల్పనకు చర్యలు

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు మౌలిక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్సను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో మౌలిక సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలియడంతో సందర్శించినట్లు చెప్పారు. కాంప్లెక్స్‌లో ఫ్యాన్లు, కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిను ఆదేశించారు. ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కోండ్రు మురళికి మంత్రి పదవి?

ప్రజాశక్తి- రేగిడి

రాజాం నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యేగా గెలుపొందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కోండ్రు మురళి మోహన్‌కి మంత్రి పదవి వరిస్తుందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఎస్‌సి రిజర్వేషన్, గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండడంతో మంత్రి పదవి వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు క్యాబినెట్‌లో కోండ్రు మురళీమోహన్ తొలిసారిగా మంత్రి పదవి దక్కించుకుంటే ఆయనకు ఇది రెండోసారి మంత్రి పదవి దక్కినట్లు అవుతుంది. నియోజకవర్గాల పునర్విభజనలో ఎచ్చెర్ల నుంచి రాజాం ఎస్‌సి రిజర్వేషన్ నియోజకవర్గంగా 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి క్యాబినెట్‌లో వైద్య శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. రాజాం నియోజకవర్గంలో రేగిడి, సంతకవిటి, వంగర, రాజాం మండలాల్లో తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, రహదారులు నిర్మాణాలు వంటివి అభివృద్ధి పథంలో నడిపించి ఈ ప్రాంతానికి సుపరిచితుడుగా ఉన్నారు. రాజకీయ పరిణామాల దృష్ట్యా రాష్ట్ర విభజన అనంతరం 2014లో చంద్రబాబు సమక్షంలో అమరావతిలో కోండ్రు మురళి తన అనుచరులతో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. 2014, 2019లో రాజాం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జిగా ఉంటూ, రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. 2024లో మరోసారి వైసిపి అభ్యర్థిపై పోటీ పడి 22,722 వేలు ఓట్లు మెజార్టీతో కోండ్రు మురళి మోహన్ గెలుపొందారు. ఆయనకు మంత్రి పదవి దక్కితే నాలుగు మండలాలను ఆదర్శ మండలాలుగా తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తానని ఇదివరకే హామీ ఇచ్చారు. గత పదేళ్లుగా అధికారం లేకపోయినా పార్టీ కోసం పనిచేసిన కోండ్రు మురళీకు మంత్రి పదవి వస్తుందన్న ఆశాభావంతో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎస్‌సి కోటాలో అవకాశం!



మీరు నావారు.. మీతో చాలా పనుంది..

నాగార్జునతో లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రజాశక్తి- గరివిడి

'మీరు నా వారు..మీతో చాలా పని ఉందని కిమిడి నాగార్జునతో నారా లోకేష్ అన్నారు. మీ సహకారం, అంకితభావంతో ఎన్నికల్లో చీపురుపల్లి నియోజకవర్గంలో అద్భుత విజయం సాధించారని నాగార్జునతో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఉండవల్లిలోని నారా లోకేష్ స్వగృహంలో ఆయనను నాగార్జున శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చీపురుపల్లి నియోజకవర్గంతో పాటు విజయనగరం పార్లమెంటు స్థానం పరిధిలోని ఉన్న నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఎమ్‌పి, ఎమ్మెల్యేల గెలుపునకు కష్టపడ్డావంటూ లోకేష్ నాగార్జునను అభినందించారు. నరసన్నపేట, ఆముదాలవలస, సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాల్లో స్టార్ క్యాంపైనర్ బాధ్యతలను చేపట్టి ఆ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి వారి విజయంలోనూ భాగస్వామ్యం అవ్వడం గొప్ప విషయమని కొనియాడారు.



లోకేష్‌ను ఆలింగనం చేసుకుంటున్న నాగార్జున

కార్యకర్తలకు తోడుగా ఉంటా

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తల కష్ట నష్టాలలో తనతో పాటు మాజీమంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్ తోడుగా ఉంటామని, ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తమను కలవవొచ్చని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో ఎన్నికల్లో పార్టీ ఓటమిపై ఆయన శుక్రవారం విశ్లేషణ చేశారు. ఈ సందర్భంగా వెన్నంటే ఉంటూ తన కోసం కష్టపడిన వైసిపి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన కోళ్ల లలితకుమారికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక ఈ ఎన్నికల్లో తాము ఓటమి చెందటానికి తమ పార్టీ కన్నా టిడిని ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తుందన్న ఆశతో ప్రజలు, ఉద్యోగులు, ముఖ్యంగా యువత వారిని గెలిపించారని గుర్తు చేశారు. ఇకపై తాము ప్రతిపక్ష పాత్ర పోషించి ప్రజల తరపున ఎటువంటి పోరాటాలైనా చేయటానికి సిద్ధంగా ఉంటామని వెల్లడించారు. ఈ ఐదేళ్లు తాను ఎమ్మెల్యేగా ఉండేందుకు అవకాశం ఇచ్చిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాజీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, ధర్మవరం ఎంపిటిసి డోల కనక మహాలక్ష్మి, పలు గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి

అక్రమ నిర్మాణాలు, పన్నులపై సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో అక్రమ నిర్మాణాలు, పన్నుల పై కౌన్సిలర్లు అధికారుల పై మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ ఆధ్వర్యంలో కమిషనర్ బాలాజీ ప్రసాద్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి, వైసిపి, జన సేన కౌన్సిలర్లు నగర పంచాయతీ పరిధిలో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని అధికార్లు పట్టించుకోక పోవడం, పన్నులు పేదవారికి ఒకలాగా, ధనికులకు ఒకలాగా వేయడం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యంగా మొయిద జంక్షన్ సినిమా హాల్ వద్ద బహుళ అంతస్తుల భవనం అనుమతి లేకుండా నిర్మాణం జరుగుతుందని ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, మిమ్స్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో ఎన్ని భవనాలకు అనుమతులు ఉన్నాయని వాటికి వేస్తున్న పన్నులు సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక జ్యూట్ మిల్ పన్నులు చెల్లించకుండా కేసులు పేరిట కాలయాపన చేస్తున్నా అధికార్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాగా నగర పంచాయతీలో పేదవారు చిన్న గొయ్యి తవ్వినా అధికార్లు వెంటనే నోటీసులు ఇచ్చి తొలగింపులు చేస్తున్నారని పెద్దవారి జోలికి వెళ్ళారా అని ధ్వజ మెత్తారు. లేవనెత్తిన సమస్యలపై చర్యలు చేపట్టకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, టిడిపి కౌన్సిలర్లు అవనాపు సత్య నారాయణ, లెంక హైమావతి, మజ్జి నాగమణి, ముడుమంచి లక్ష్మీ, జనసేన కౌన్సిలర్ పాండ్రంకి సత్యవతి, వైసిపి కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

వాడీ వేడిగా నగర పంచాయతీ సమావేశం



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సరోజిని

ముగిసిన బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో గత 35 రోజులుగా కొనసాగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసిందని చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమానికి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుకూరి రఘురాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారని ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ మల్ల వేణు, నారాయణ పాఠశాల ఎజిఎం శ్రీనివాసరావు, పిఆర్ షటిల్ కోర్టు సభ్యులు మంథా సుబ్బారావు, విన్నకోట మురళి, స్పార్టన్ షటిల్ కోర్ట్ సభ్యులు జె.విజయరామరాజు, డి.వి సూర్యనారాయణ పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ వేణు మాట్లాడుతూ క్రీడల్లో ఇంజురీస్ సర్వసాధారణంగా ఉంటాయని వాటిని జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తూ ముందుకు సాగాలని అన్నారు. ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, మనోధైర్యానికి, ఉపయోగపడతాయని, ఇప్పటికీ 18 సంవత్సరాల నుండి ఈ వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం దాతల సహాయ సహకారంతో నిర్వహిస్తున్నామని అన్నారు. బ్యాడ్మింటన్ క్రీడను నలు దిశలు వ్యాపింపజేస్తున్న అపర ద్రోణాచార్యులు లాంటి పొట్నూరు శ్రీరాములు ఎస్‌కోటలో ఉండడం క్రీడాకారులకు ఒక వరమని కొనియాడారు. చీఫ్ కోచ్ శ్రీరాములు మాట్లాడుతూ ఎస్ కోటలో క్రీడలు మనగలుగుతున్నాయంటే దానికి దాతల సహాయ సహకారాలే కారణమని చెప్పారు. ముఖ్యంగా రఘు రాజు మిత్ర బృందం సహాయ సహకారాల వల్ల ఈ బ్యాడ్మింటన్ శిబిరాలు నిర్వహించగలుగుతున్నామని చెప్పారు. అనంతరం ఈ శిక్షణ శిబిరంలో చివరగా విద్యార్థుల మధ్య నిర్వహించిన టోర్నమెంట్లో గెలుపొందిన క్రీడాకారులకు ఇందుకూరి రఘురాజు ఇతర అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రఘురాజు



నిధుల దుర్వినియోగంపై సిబ్బందిని విచారిస్తున్న ఎంపిడిఒ రమణయ్య, తదితరులు

పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని అప్పన్నదొరపాలేం గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగంపై స్థానిక ఎంపిడిఒ ఎస్. రమణయ్య శుక్రవారం విచారణ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఉగ్గిన మహేశ్వరరావు లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో లోకాయుక్త పూర్తి విచారణ బాధ్యతలను ఎంపిడిఒకు అప్పగించారు. దీంతో ఆయన గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టారు. ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి అప్పన్నదొరపాలెం పంచాయతీ ఆఫీసుకు వెళ్లి రికార్డులన్నీ పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులని వశపరచుకొని తదుపరి విచారణను మంగళవారం నాటికి వాయిదా వేశారు. విచారణకు పంచాయతీ కార్యదర్శి బి. సంధ్య శ్రీ, గ్రామ సర్పంచ్ జోడు రాములమ్మ హాజరు కాలేదు. చేసేదిలేక ఎంపిడిఒ రమణయ్య పూర్తిగా రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.ధర్మారావు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రంథాలయాలతో మేధాశక్తి పెంపు సాధ్యపడుతోందని విద్యార్థులకు చిన్న వయసు నుంచే లైబ్రరీలు అలవాటు పరచాలని, స్థానిక పంచాయతీ ఇఒ కన్నబాబు అన్నారు. కొత్తవలస శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం స్థానిక లైబ్రరియన్ రామలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. కన్నబాబు మాట్లాడుతూ ప్రపంచ జ్ఞానం పెంపొందించడానికి లైబ్రరీలు ఎంతో దోహదపడతాయని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. ఎందరో మేధావులు లైబ్రరీలోనే తన జ్ఞానం సంపాదించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపియుపి స్కూల్ హెచ్ఎం ఆచార్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది వెంకటరమణ, పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు.



డెంకాడ: గెలిచిన బహుమతులతో విద్యార్థులు

వేపాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. లైబ్రేరీయన్ ఎం. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మూడు వారాలు పాటు జరిగిన ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం లైబ్రేరీ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ పని వేళల్లో వచ్చి గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో మూడు వారాలు పాటు నిర్వహించిన వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఇన్ని రోజులు విద్యార్థులకు గ్రంథాలయంలో పుస్తకాలు చదివించడం, రాయడం, క్రీడా పోటీలను నిర్వహించి గ్రంథాలయాధికారి మహేష్ ఉత్సాహ పరిచారు. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిని సీరపు ఇందుమతి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం తరగతుల ముగింపు సభ ఏర్పాటు చేశారు. గత నెల 15 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఈ శిబిరాన్ని నిర్వహించామని ఈ సమయంలో పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథ్స్ తరగతులు నిర్వహించామని ఆమె తెలిపారు. ముగింపు కార్యక్రమానికి కుమిలి జెడ్‌పిహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు ఎస్ రాంబాబు, వై శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు గ్రంథాలయాధికారిణిని సన్మానించారు.

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధి కోరాడ వీధిలో గల శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. 24 రోజులుగా లైబ్రేరియన్ ఎస్.స్వర్ణ కుమారి ఆధ్వర్యంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రైమరీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలపై ఆసక్తి పెంచు కోవాలన్నారు. మాజీ సైనికులు వివిఎస్ శర్మ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు వినోదాలు, విలాసాలకు అలవాటు పడకుండా వారిలో దాగున్న ప్రతిభను వెలికి తీయడమే వేసవి విజ్ఞాన శిబిరం ముఖ్య ఉద్దేశమని అన్నారు. అనంతరం శిబిరంలో నిర్వహించిన పలు ఆటల పోటీలు, చిత్రలేఖనం, పాటలు తదితర పోటీల్లో పాల్గొన్న విజేతలకు మాజీ సైనికుడు వి.ఎన్.శర్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు సెక్రటరీ, పోటీ పరీక్షల్లో పాల్గొంటున్న పాఠకులు బర్ల బేబీ ప్రత్యూష, వాసుదేవరావు, వెంకటరమణ, కుర్మారావు, దివ్య, అప్పలనాయుడు విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



తెర్లా: విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఇఒ

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞానం శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒలు త్రినాధరావు, పాపారావు, సత్యనారాయణ పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలపై ఆసక్తి పెంచుకోవాలని వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి సిహెచ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.